క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ

ధరూరు: కాంప్లెక్స్ పరిధిలోని భీంపురం, పెద్ద పాడు, ఎములోనిపల్లి పాఠశాలలను గురువారం కాంప్లెక్స్ జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్, ఎఫ్ఆర్ఎస్, యూ డైస్‌లో కొత్తగా చేరిన విద్యార్థులను నమోదు చేయాలని హెచ్ఎంలకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ నర్సింహులు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

మల్దకల్: మండలంలోని బిజ్వారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం డాక్టర్ కుమార్తె శ్రీవిసంస్కృతి జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాలకు రూ.27వేల విలువ చేసే మైక్రోబయాలజీ పరికరాలను బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేష్‌కుమార్, తిమ్మప్ప, అన్నమయ్య, నాగమ్మ, నాగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్దకల్ ఎంపీఓగా చెన్నయ్య



మల్దకల్: మండల పరిషత్ కార్యాలయ ఎంపీఓగా చెన్నయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వడ్డేపల్లికి బదిలీపై వెళ్లారు. దీంతో గద్వాల ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న చెన్నయ్య మల్దకల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ

ధరూరు: మండల కేంద్రానికి చెందిన కుర్వ కాశీమన్న ఇటీవల రోడ్డు ప్రమదానికి గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. ఆమె వెంట అల్వాల రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్, వెంకట్‌రెడ్డి, కుర్వ శ్రీను తదితరులు ఉన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డాక్టర్ రిజ్వానా తన్వీర్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. మండలంలోని పెద్దపోతులపాడు చెందిన 34మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సత్యానారాయణ, హెలెన్, చంద్రన్న, తిరుమల్‌రావు, శారద, చిట్టెమ్మ, సోని తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మానవపాడు: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రిజ్వానా తన్వీర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశాలతో సమీక్ష నిర్వహించారు. వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా తదితర వ్యాధులు రాకుండా కీటక జనిత వ్యాధులు రాకుండా, దోమలు వృద్ధి చెందకుండా వాటిని నియంత్రించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్మికుల చేత మురుగు, చెత్తాచెదారం తొలగించాలని తెలిపారు. తుంగభద్ర తీరాన ఉన్న మద్దూరు, పల్లెపాడు, కొర్విపాడు, కలుగొట్ల, పుల్లూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన చిన్నారి నిహాంత్‌రెడ్డి

అయిజ: వీధికుక్కలు దాడిచేయడంతో చిన్నారి గాయపడిన ఘటన మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన భీమేశ్వర్‌రెడ్డి, మాధవి దంపతుల కుమారుడు నిహాంత్‌రెడ్డిపై గురువారం వీధికుక్కలు దాడిచేసి గాయపరిచాయి. రాయచూర్ రోడ్డు సమీపంలో చేతిలో బిస్కెట్ పట్టుకొని వెళ్తున్న చిన్నారిపై రెండు వీధికుక్కలు దాడిచేసి ముఖంపై గాయపర్చడంతో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

అపరిశుభ్రంగా కార్యాలయాల ఆవరణ

మానవపాడు: ప్రభుత్వం ఆరోగ్యపై జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. మండలంలోని పల్లెపాడు ఆరోగ్య కేంద్రం, పోస్టాఫీస్, వెటర్నరీ వైద్యశాల ఒకటే చోట ఉన్నాయి. ఈ కార్యాలయాల చుట్టూ మురుగు నిలిచి ఈగలు, దోమలు వ్యాపి చెందుతున్నారు. పోస్టాఫీసులో గురువారం పింఛన్ తీసుకునేందుకు లబ్ధిదారులు వరుసలో నిలిచిఉండగా, పక్కనే మురుగు వాసనతో ఇబ్బందులు పడ్డారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు.

ప్రమాదకరంగా పుష్కరఘాట్లు

- వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఇనుప కంచెలు
- పట్టించుకోని అధికారులు


పుష్కరఘాట్ వద్ద నిలబడిన భక్తులు


కృష్ణమ్మ విగ్రహం చుట్టూ ధ్వంసమైన ఇనుపకంచె

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కృష్ణానది వద్ద పుష్కరఘాట్లలో భక్తుల రక్షణకోసం ఏర్పాటుచేసిన ఇనుప కంచెలు కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా పూర్తిగా ధ్వంసమై కొట్టుకుపోయాయి. ప్రతి వర్షాకాలంలో కృష్ణానది నెలల తరబడి వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంది. దీనిని తిలకించేందుకు ప్రతి ఆదివారం పర్యాటకులు కుటుంబసభ్యులతో కలిసి అధిక సంఖ్యలో వస్తుంటారు. అదేవిధంగా నెల రోజుల పాటు జరిగే బీచుపల్లి ఆంజనేయస్వామి ఉత్సవాలతో పాటు పది రోజుల పాటు జరిగే వినాయక నిమజ్జనంకు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. పుష్కరఘాట్లలో సరైన భద్రత లేకపోవడంతో ఎంతో మంది యువకులు ప్రాణాలను కోల్పోయారు. కానీ ఎన్ని ప్రమాద ఘటనలు జరిగినా అధికారుల తీరులో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి మార్పు రాలేదని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నదిఒడ్డున ప్రముఖ ఆలయాలు

బీచుపల్లి పుణ్యక్షేత్రంలో అభయాంజనేయస్వామి, కోదండరామస్వామి, జ్ఞాన సరస్వతి ఆలయంతో పాటు శివాలయం వంటి ప్రముఖ ఆలయాలు ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో భక్తులు బీచుపల్లి క్షేత్రానికి వస్తుంటారు. వచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో మొక్కులు తీర్చుకుని వెళ్తుంటారు. పుష్కరఘాట్లలో స్నానాలు చేసే వద్ద, కృష్ణమ్మ విగ్రహం వద్ద రక్షణకోసం ఏర్పాటు చేసిన ఇనుపకంచెలు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు తప్పడం లేదని భక్తులు వాపోతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నారు



పుష్కరఘాట్ వద్ద ఇనుప కంచెలు సక్రమంగా లేకపోవడంతో యువత అధికంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. వినాయక నిమజ్జనం రోజు రాత్రివేళల్లో భక్తులు రావడంతో రక్షణకు ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు లేకపోవడంతో గమనించక నీటిలో మునిగిపోతున్నారు. కొంతమంది యువకులు ఘాట్లలో సెల్ఫీలను దిగుతూ రక్షణ కంచెలు లేకపోవడంతో ప్రమాదంలో పడి ప్రాణాలను సైతం పోగొట్టుకున్నారు.

– మద్దిలేటి, భక్తుడు

రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలి



పుష్కరఘాట్లలో వరదల కారణంగా కంచెలు పూర్తిగా కొట్టుకుపోవడం వల్ల భక్తులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆదివారం సెలవుదినం కావడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. భక్తుల రక్షణ కోసం తక్షణమే అధికారులు ఇనుప కంచెలను ఏర్పాటు చేయాలి.

– బస్వలింగం, భక్తుడు

అభివృద్ధిని విస్మరిస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అలంపూర్: నియోజకవర్గ అభివృద్ధిని ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బలరాంరెడ్డి అన్నారు. మున్సిపాలిటిలో బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 2009లో అలంపూర్‌ను వరదలు ముంచెత్తి 14 ఏళ్లయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. నిర్వాసితులకు పట్టాలిచ్చి స్థలాలు చూపడం లేదన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులు మధ్యలోనే నిలిచిపోతున్నాయన్నారు. సమావేశంలో నాగమల్లయ్య, రాజగోపాల్, మహేష్, వినీత్‌కుమార్, శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే


ర్యాలంపాడ్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అలంపూర రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో గురువారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఎక్కువ రోజులు నీళ్ల నిల్వ ఉంచరాదని, పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి వడబోసిన నీటి తాగాలని పీహెచ్‌సీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీకాంతం, హెల్త్ అసిస్టెంట్ బాలీశ్వరయ్య శెట్టి, అక్కమ్మ, పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఫీవర్ సర్వే పీహెచ్‌సీ సిబ్బంది గురువారం చేపట్టారు. ఇళ్ల ముందు ఉన్న సంపులు, వివిధ పాత్రల్లో నిల్వ నీటిని పారబోశారు. ఇళ్ల సమీపంలో, ఆవరణలో, వీధుల్లో వర్షపునీరు, మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని దోమలు ప్రభలకుండా చూడాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ షబ్బీర్ హుస్సేన్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి


గద్వాలలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు


కేటీదొడ్డిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గద్వాల రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు సంజీవ్‌భరద్వాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేవైఎం ఆదేశాల మేరకు గురువారం గద్వాల డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సింహ, సోమశేఖర్, పవన్, తిమ్మన్న, రిషిగౌడ్, అనిల్ కుమార్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ షాహిదాబేగంకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామన్నారు. గొల్ల కురుమలకు అధికారం వచ్చిన వెంటనే 100 రోజుల్లోనే రెండో దశ గొర్రెల పంపిణీకి సంబంధించిన రూ.2లక్షలు లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. హామీలను అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హన్మిరెడ్డి, శ్రీపాదరెడ్డి, నాగిరెడ్డి, దేవెందర్ రెడ్డి, కృష్ణకాంత్, కృష్ణ, తదితరులు ఉన్నారు.

ధరూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా.. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని బీజేపీ మండల నాయకులు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలంటూ తహసీల్దార్ వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, కిష్టన్న కృష్ణారెడ్డి, ప్రతాప్, జనార్దన్‌రెడ్డి, ముచ్చ నర్సింహులు, సవారన్న, వేమారెడ్డి, శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్ల విడుదల


పోస్టర్‌లు విడుదల చేస్తున్న ఎస్ఐ సంతోష్, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు

శాంతినగర్ : తెలంగాణ ఫొటో అండ్ వీడియో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఎల్బీ నగర్, హైదరాబాద్ కేవీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో జరిగే ఫొటో ఎక్స్‌పో కార్యక్రమం పోస్టర్లను ఎస్ఐ సంతోష్ విడుదల చేశారు. ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామకృష్ణ, శాంతిరాజు, రమేష్, జాన్, రవి, రాజ్‌గౌడ్, జోసెఫ్, శివ, రాము, తిరుమలేష్, రషీద్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం


కంచుపాడులో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో గురువారం పోలీస్ కళాబృందం పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, సైబర్‌క్రైం, భూ తగాదాల విషయంలో, గంజాయి, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామంలో అందరూ కులమత బేధాలు లేకుండా జీవించాలని, విద్యార్థుల చదువులపై తల్లితండ్రులు ఎప్పటికప్పుడు ఆరా తీస్తుండాలన్నారు. సైబర్‌క్రైం వలలో పడి మోసపోకూడదన్నారు. గ్రామాల్లో చోరీలు కాకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ నిధులు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో గట్టుకు చెందిన పద్మకు మెరుగైన వైద్యం నిమిత్తం రూ.2.50లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రైతుబీమాకు దరఖాస్తుల స్వీకరణ


కేటీదొడ్డిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓ

కేటీదొడ్డి: మండలంలోని రైతులు రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఈఓలు జ్యోతి, ప్రియాంక తెలిపారు. గురువారం మండలంలోని ఇర్కిచేడు, మైలగడ్డలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గత నెల 28 వరకు భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు అర్హులని పేర్కొన్నారు.

గట్టు: మండలంలోని తప్పెట్లమొర్సులో గురువారం ఏఈఓ అనిత రైతుబీమా పథకం కోసం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రైతుబీమా చేయించుకోని వివరాలను రైతువేదిక దగ్గర జాబితాను ఏర్పాటు చేశారు.

నత్తనడకన వంతెన నిర్మాణం


వాగుపై నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి

అయిజ: మండల కేంద్రంకు సమీపంలో వాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయిజ నుంచి పులికల్ వరకు చేపట్టిన రోడ్డులో భాగంగా సుమారు రూ.3కోట్ల నిధులతో అధికారులు బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టారు. టెండర్ పనులు పూర్తయ్యి సుమారు ఏడుళ్లు కావస్తున్నా పనులు పూర్తికాలేదు. ఇప్పటి వరకు బ్రిడ్జి గోడలు మాత్రమే నిర్మించారు. దానిపై స్లాబ్ నిర్మించి, అప్రోచ్ రోడ్డును నిర్మించాల్సి ఉంది. బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో పర్దిపురం, పులికల్, మేడికొండ, రాజాపురం గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతను పూడ్చిన మున్సిపల్ సిబ్బంది


ఎర్రమట్టి నింపుతూ గుంతను పూడ్చుతున్న జేసీబీ

సాక్షి ఎఫెక్ట్..

శాంతినగర్: 'సాక్షి ఫోన్ ఇన్'లో వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని రామచంద్రా నగర్ సమీపంలోని పల్లె దవాఖాన సమీపంలో ఇబ్బందికరంగా ఉన్న గుంతను ఎట్టకేలకు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి గురువారం పూడ్చించారు. గత శుక్రవారం సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పట్టణ వాసుల ప్రధాన సమస్య అయిన మురుగునీటితో నిండిన పెద్ద గుంతను పూడ్చించాలని, డ్రెయినేజీలు శుభ్రం చేయించాలని, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని, రోగాల బారిన పడకుండా పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. భారీ ఖర్చుతో కూడిన పని అయినప్పటికీ కమిషనర్ యుద్ధ ప్రాతిపదికన జేసీబీ, ట్రాక్టర్లతో పనులు చేయించారు. అంతేగాక పట్టణంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతో పట్టణ వాసులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీలో ఆరోగ్యశ్రీ సౌకర్యం కల్పించండి

మంత్రికి విన్నవించిన ఎమ్మెల్యే విజేయుడు


వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

అలంపూర్: పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్‌లో ఆరోగ్యశ్రీ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే విజేయుడు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. హైదరాబాద్‌లోను మంత్రిని ఎమ్మెల్యే గురువారం కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న అలంపూర్ నియోజకవర్గంలోని ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు, జర్నలిస్టులకు పొరుగున ఉన్న కర్నూల్‌లో ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని కోరినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రలో అలంపూర్ ప్రాంత ప్రజలు కర్నూల్‌లో వైద్య సదుపాయం పొందే అవకాశం ఉండేదని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత స్థానికంగా వైద్య సౌకర్యాలు లేకపోవడంతో కర్నూల్‌లోని ఆస్పత్రిలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా అలంపూర్‌చౌరస్తాలో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించి ప్రజలకు వైద్య సేవలు పొందడానికి చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మంత్రికి వినతిపత్రం అందజేశారు. వీరితోపాటు మాజీ ఎంపీపీ అశోక్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రఘు రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎల్ఓసీ అందజేత

అలంపూర్ నియోజకవర్గంలోని రాజోళి మండలం ముండ్లదిన్నెకు చెందిన శిరీష ఆపరేషన్ చేయించుకోవడం కోసం రూ. 1.50 లక్షలు ఎల్ఓసీని హైదరబాద్‌లో ఎమ్మెల్యే గురువారం కుటుంబసభ్యులకు అందజేశారు.

బాటసారుల దాహార్తి తీర్చండి


అయిజ-తూంకుంట రోడ్డు పక్కన చెడిపోయిన చేతిపంపు

అయిజ: రోడ్డుపై వెళ్తున్న బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చేతిపంపునకు మరమ్మతు చేయాలని బాటసారులు కోరుతున్నారు. అయిజ–తూంకుంట రోడ్డు పక్కన పంట పొలాల వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేతిపంపు పనిచేయకుండా పోయింది. చేతి పంపు ఏర్పాటు చేసినప్పటి నుంచి రోడ్డుపై ప్రయాణించే వారు నీరు తాగి దాహం తీర్చుకునేవారు. పంట పొలాల్లో పనిచేసే రైతులు చేతిపంపువద్దకు వచ్చి నీరు తాగేవారు. అధికారులు చేతిపంపునకు మరమ్మతు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనిచేయని నిఘానేత్రం


మైలగడ్డ ప్రధాన కూడలిలో పనిచేయని సీసీ కెమెరాలు


కొండాపురం స్టేజీ సమీపంలో పనిచేయని సీసీ కెమెరాలు

- గ్రామాల్లో సీసీ కెమెరాల నిర్వహణ అస్తవ్యస్తం
- రూ.వేలు ఖర్చు పెట్టినా నిరుపయోగమే!

కేటీదొడ్డి: మండలంలోని ఆయా గ్రామాల్లో చోరీలు అదుపులోకి తెచ్చేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ వాటి నిర్వాహణపై నిర్లక్ష్యం వహించడంతో అవి మూలన పడ్డాయి. చోరీలు జరిగినప్పుడు వాటిని ఛేదించడం పోలీసులకు సవాలుగా మారింది. ఆరంభంలో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసినప్పటికీ వాటి నిర్వహణ జాప్యం ఏర్పడింది. రూ.లక్షలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, విరాళాలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంతో పాటు మైలగడ్డ, కొండాపురం, నందిన్నె, కేటీదొడ్డి, ఇర్కిచేడు, కుచినెర్ల, తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి..

దాతల సాయంతో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల నిర్వాహణ బాధ్యత ఎవరు తీసుకోవాలనే ప్రశ్న ప్రతి గ్రామంలో తలెత్తింది. ఇటీవల మండల కేంద్రంతో పాటు చాలా మండలాల్లో బైక్, కిరాణ, ఆన్‌లైన్ షాపుల్లో ఇండ్లలో చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. 7నెలల క్రితం మైలగడ్డ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్, కిరాణషాపులో చోరీ చేశారు. కుచినెర్ల గ్రామంలో ఓ మహిళ మెడలో బంగారు ఎత్తుకెళ్లిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేస్తేనే ఇలాంటి సంఘటనలు అడ్డుకోవడానికి ఆస్కారముందని పోలీసులు పేర్కొంటున్నారు. పోలీసులు మంత్రాంగం కూడా నిందితులను త్వరగా పట్టుకుని శిక్షించే వీలు కలుగుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ చూపి గ్రామాల్లో సీసీ కెమెరాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



కేటీదొడ్డి మండల కేంద్రంలో చాలా రోజులుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఇటీవల కిరాణ షాపులో ఎత్తుకెళ్లారు. మండలానికి చాలామంది వివిధ పనులకు వస్తూ వెళ్తుంటారు. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి కెమెరాల మరమ్మతులు చేపట్టాలి.

– శివ, ఆన్‌లైన్ సెంటర్ యాజమాని

ఘనంగా ఎర్రసత్యం జయంతి


ఎర్రసత్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాల: దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం జయంతి ఘనంగా నిర్వహించారు. గురువారం తెలుగు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు నర్సింహులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనార్దన్, దౌలన్న, ప్రసాద్, పాండు, అంజి, నర్సింహులు, రఘు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చండి


పాతబస్టాండ్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

అయిజ: మున్సిపాలిటీలోని పాతబస్టాండ్‌లో బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు. రోడ్డుపై లోతైన గుంతలు ఏర్పడడంతో వర్షం నీరు నిలిచి ఉంటుందని, దీంతో వాహనాలపై వెళ్లేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతల్లో నీరు నిలిచి ఉండడం వలన గుంతలు ఎంతలోతు ఉన్నాయో తెలియకపోవడంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.